క్లుప్తంగా

అనువైన విత్తనాలను ఎంచుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు,అధికారులు

ఇబ్రహీంపట్నం: రైతులు అనువైన వరి వంగడాలను ఎంచుకోవాలని శాస్త్రవేత్తలు మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వివరించారు. కొత్తగా విడుదలైన వరి వంగడాల పైన, ఈ వర్షాకాలం సీజన్‌కు అనుకూలమైన దొడ్డు రకం, సన్నగింజ రకం రకాల వరి విత్తనాలపై శాస్త్రవేత్త సతీష్‌చంద్ర వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చడం వలన నేలలో భూసారం తగ్గుతుందని, సూక్ష్మ జీవులు నశించి పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందని శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ లావణ్య, కోరుట్ల ఏడీఏ సాహిద్ అలీ, ఏవోలు దీపిక, యోగిత, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో కోరుట్ల యువకుల సత్తా



సాధించిన పతకాలతో యువకులు

కోరుట్ల: హైదరాబాద్‌లోని కోటి హనుమాన్ వ్యాయామశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కోరుట్ల పట్టణానికి చెందిన యువకులు సత్తా చాటారు. కల్లెడ రోహిత్ రాష్ట్ర స్థాయిలో బెంచ్ ప్రెస్, డెడ్లిఫ్ట్, ఓవర్ ఆల్ పవర్ లిఫ్టింగ్‌లో మూడు బంగారు పతకాలు సాధించాడు. ఠాకూర్ పృథ్వీ సింగ్ బెంచీప్రెస్ లో బంగారు పతకం, ఓవర్ ఆల్ పవర్ లిఫ్టింగ్‌లో వెండి పతకం సాధించాడు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన యువకులను పలువురు అభినందించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన ఎల్లాల గోపాల్ రెడ్డి ఇటీవల మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా, సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా మొబైల్‌ఫోన్‌ను గుర్తించి మంగళవారం పట్టణ సీఐ వేణుగోపాల్ గోపాల్‌రెడ్డికి అప్పగించారు.కార్యక్రమంలో ఎస్సై మన్మథరావు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెగడపల్లి: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాలు.. పెగడపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో నివాసముంటున్న ఆరె దశరథం, అతడి సోదరుడు మహేందర్ మంగళవారం ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి మల్యాలకు వెళ్లారు. ఈక్రమంలో దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.1.43 లక్షలు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్న విషయాన్ని గుర్తించిన దశరథం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై రామకృష్ణ ఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

ధర్మపురి: మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన అకుబత్తిని కొమురయ్య ధర్మపురిలోని గాయత్రీ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో నిర్భయ సేవింగ్ బ్యాంకు ఖాతాదారుడిగా ఉన్నారు. గత 2022 నవంబర్ 22న ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, సేవింగ్ ఖాతాపై ప్రమాద బీమా సౌకర్యం కింద లక్ష రూ.ల చెక్కు మంజూరు కాగా, మంగళవారం బ్యాంకు మేనేజర్ పొజ్జల మోహన్ మృతుడి భార్య వరలక్ష్మికి అందజేశారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

‘బోనస్ హామీ బోగస్ అయింది’

మల్లాపూర్: వరికి రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల హామీ బోగస్ అయిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ లో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలు, రైతులను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో మొండి చెయ్యి చూపుతోందన్నారు. కాంగ్రెస్‌కు పాలన చేతకాక ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దొడ్డు, సన్న రకాల వడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వాల్సిందేనని, లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాడుతామన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు ఏనుగు రాంరెడ్డి, రాజేశ్, నాయకులు రమేశ్ రెడ్డి, సిద్ధ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ భవన నిర్మాణమెప్పుడో?

- నిలిచిపోయిన నిర్మాణపనులు
- అద్దె భవనంలో కొనసాగుతున్న రాయికల్ మున్సిపల్ కార్యాలయం
- పట్టించుకోని పాలకవర్గం



నిలిచిపోయిన మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులు

రాయికల్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనే చందంగా తయారైంది రాయికల్ మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణం.. రాయికల్ మున్సిపాలిటీగా ఏర్పాటైనాక సొంత భవనం లేకపోవడంతో భవన నిర్మాణానికి అధికారులు టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద 22.09.2023న రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. రూ.92 లక్షలకు మున్సిపల్ భవన నిర్మాణానికి కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. సెప్టెంబర్ 2023 నుంచి ఆరునెలలోపే మున్సిపల్ భవనాన్ని జీ ప్లస్ 2 నిర్మించాల్సి ఉండగా దక్కించుకున్న కాంట్రాక్టర్ మల్లారెడ్డికి చేసిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశారు. దీంతో పనులు అక్కడే ఆగిపోయాయి. మున్సిపల్ భవనం కోసం తాత్కాలికంగా రాయికల్ పట్టణ శివారులో నెలకు రూ.15 వేల చొప్పున అద్దెకు తీసుకున్నారు. పట్టణానికి దూరంగా ఉండటంతో పట్టణ ప్రజలు కార్యాలయానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు స్పందించి మున్సిపల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పనుల్లో నాణ్యతా లోపం

రాయికల్ మున్సిపల్ భవనం జీప్లస్ 2 భవనం నిర్మాణం కోసం అనుమతులు రాగా, కాంట్రాక్టర్ ఒక ఫ్లోర్ మాత్రమే నిర్మించగా చేసిన పనుల్లో సైతం నాణ్యత లోపించిందని కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఈ విషయంపై కమిటీ సమావేశంలో లేవనెత్తినప్పటికీ అధికార పాలకవర్గం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలుకోరుతున్నారు.

కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నాం



రాయికల్ మున్సిపల్ భవన నిర్మాణం కోసం కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నాం. బిల్లులు సకాలంలో రాకపోవడంతోనే పనులు నిలిపివేశారు. మున్సిపల్ భవనాన్ని త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం. మా హయాంలోనే భవన నిర్మాణం పూర్తవుతుంది.

– మోర హన్మండ్లు, మున్సిపల్ చైర్మన్

రాజీవ్ గాంధీకి ఘన నివాళి





కోరుట్ల, పెగడపల్లిలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలరూరల్: నవ భారత నిర్మాణానికి సాంకేతిక విజ్ఞానానికి అందించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని ఎంపీపీ మంగళారపు మహేశ్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నర్సింగాపూర్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరుట్ల: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు.కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ భారత దేశానికి ఐటీ రంగాన్ని పరిచయం చేసిన మహానేత రాజీవ్ గాంధీ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తిరుమల గంగాధర్ గౌడ్, ఎంబేరి నాగ భూషణం, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజం, మచ్చ కవిత, నాయకులు చెదలు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: దివంగత భారత ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రజలందరు కృషి చేయాలని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మల్లాపూర్‌లో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ పూండ్ర లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కోటగిరి ఆనంద్‌గౌడ్, ఏలేటి నర్సారెడ్డి, ఎలాల లక్ష్మారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మేడిపల్లి, భీమారం మండల కేంద్రాల్లో ఆయన చిత్రపటాలకు నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేశ్ రెడ్డి, రమేశ్ రెడ్డి, చేపూరి నాగరాజు, బొమ్మెన ప్రశాంత్,పాల్గొన్నారు.

పెగడపల్లి: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, ముబీన్,తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పరిష్కారానికి కృషి



రేచపల్లిలో మంచినీటి బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

సారంగాపూర్: ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేచపల్లిలో మంగళవారం పర్యటించారు. ఉన్నత పాఠశాల వెనక చెరువును ఆనుకుని ఉన్న ప్రదేశంలో తవ్విన రక్షిత మంచినీటి బావికి చుట్టూ సిమెంట్ లైనింగ్ లేక బావి కూలిపోయి, నీటి లభ్యత తగ్గిందని గ్రామస్తులు వివరించగా, రక్షిత మంచినీటి బావిని పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత నిధులు మంజూరు చేసి కచేరి ప్రాంతానికి నీరు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, లావణ్య, ఇబ్రహీం, సరళ, ప్రసాద్, తిరుపతిరెడ్డి , ఆనందరెడ్డి, ఆసాది రాజన్న, తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్‌లో రేణుక ఎల్లమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జీవన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన వెంట జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, నాయకులు అనుపురం లింబాద్రిగౌడ్, సాయగౌడ్, భూమాగౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

మల్లాపూర్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని జగిత్యాలలో మంగళవారం పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, మండల నాయకులు ఎండీ.జాఫర్, ఇప్పపెల్లి గణేశ్ ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చెరుకు రైతులకు హామీ ఇచ్చిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం త్వరలోనే పునరుద్ధరిస్తుందన్నారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల: వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని, బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి’

ధర్మపురి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ డిమాండ్ చేశారు. ధర్మపురిలో మంగళవారం మాట్లాడారు. అమలుకు నోచుకోలేని వాగ్దానాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ తీరును ప్రజలు గమనిస్తున్నారని ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఒక్క ప్రయాణం తప్పా ఏ ఒక్కటి నెరవేర్చలేదని అన్నారు. 500 రూ.ల బోనస్ ఇస్తానని చెప్పి సన్న రకంకు బోనస్ ప్రకటిస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చని పక్షంలో రైతుల పక్షాన బీఆర్ఆస్ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్టిబాబు, బీఆర్‌ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు ఆకుల రాజేష్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే చేరాలి



కొత్తదాంరాజుపల్లిలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

సారంగాపూర్: ఉత్తమ బోధన, మంచి ఫలితాల కోసం సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు మండలంలోని పెంబట్ల, కోనాపూర్, రేచపల్లి గ్రామాల్లో విద్యార్థులు, తల్లితండ్రులను కోరారు. మంగళవారం ఆయా గ్రామాల్లో వారు ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి సారంగాపూర్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తెలుగు, ఆంగ్లమాధ్యమాల్లో బోధన జరుగుతుందని, లైబ్రరీ, ల్యాబ్, మంచి భవనాలు, అన్ని సబ్జెక్టులకు పూర్తిస్థాయిలో అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని, జిల్లాలోనే ఉత్తమ కళాశాలగా పేరుందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, వైస్ ప్రిన్సిపల్ కొంక వేణు, అధ్యాపకులు రాజేందర్, రాజు, సౌజన్య, వెంకటేశ్వర్లు, సుజాత పాల్గొన్నారు.

మల్లాపూర్: ఎస్సెస్సీ పూర్తయిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరాలని మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం ఎ.ఖలిక్ కోరారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లి, సంగెం–శ్రీరాంపూర్ గ్రామాల్లో ప్రభుత్వ కళాశాల అధ్యాపకులతో కలిసి ఆయన ప్రచారం చేశారు. 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రైవేటు కళాశాలలకు దీటుగా జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు సాధించాయన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత బస్‌పాస్, స్కాలర్‌షిప్‌లతో పాటు విశాలమైన తరగతిగదులు, అనుభవజ్ఞులైన ఆధ్యాపక బృందంతో ప్రభుత్వ కళాశాలలో బోధన తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాంచర్ల రాజేశం, శ్రీనివాస్, నరేశ్, అరవింద్, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

కథలాపూర్: రైతులు పంటల సాగులో మోతాదుకి మించి ఎరువులు వాడొద్దని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాండ్ర్యాలలో మంగళవారం రైతులకు భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వరి పంట చేతికొచ్చాక భూమిలోని వరికొయ్యలను కాలబెట్టవద్దన్నారు. భూసార పరీక్షలు చేయించి వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వాడాలన్నారు. కార్యక్రమంలో ఏవో యోగితా, ఏఈవో సుష్మా, రైతులు పాల్గొన్నారు.

మఠమాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

మల్యాల: మండల కేంద్రంలోని మఠమాంజనేయ స్వామి ఆలయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకల్లో స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. భగవద్గీత పారాయణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మిట్టపల్లి లక్ష్మీనారాయణ, కుర్రె మనోహర్, కొక్కుల సుధాకర్, గుండేటి మోహన్, ప్రేమ్, అల్లూరి శ్రీనివాస్ రెడ్డి, గాజుల మల్లేశం, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

వరికి బోనస్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా





పెగడపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, గొల్లపల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

పెగడపల్లి: రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించాలని బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వరికి రూ. 500 బోనస్ చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం సన్నవరికి మాత్రమే బోనస్ చెల్లిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని రకాల ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కరుణాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బుగ్గారంలో..

బుగ్గారం: రాష్ట్రప్రభుత్వం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేసిందని నిరసిస్తూ మంగళవారం బుగ్గారంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.500 ల బోనస్ ఇచ్చి ఆదుకోవాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

గొల్లపల్లి: కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ రూ.500 ఇస్తానని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గోస్కుల జలందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, దగా, నయవంచన, గ్యారెంటీ కార్డులో వరి పంటకు రూ.500 బోనస్ అని ప్రకటించి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కుతారా అని ప్రశ్నించారు. ఇది ప్రజాపాలన కాదు, రైతు వ్యతిరేక పాలన అన్నారు. కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాలపాలు చేసి ఆగం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కో ఆర్డినేటర్ బోయపోతు గంగాధర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ నవ్వ తిరుపతి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మారంపల్లి బాబు, ప్యాక్స్ డైరెక్టర్ కచ్చు కొమురయ్య, మండల అనుబంధ సంఘాల అధ్యక్షులు బలభక్తుల కిషన్, సామల విరస్వామి, అవరి చందు, మ్యాదరి రమేష్, జలందర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాల లారీ బోల్తా



రాయికల్: వరి ధాన్యాన్ని తరలిస్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. రాయికల్ పట్టణంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 650 ధాన్యం బస్తాలను మంగళవారం లారీలో కోరుట్ల మండలం జోగినిపల్లి గ్రామ శివారులోని రాజరాజేశ్వర రైస్‌మిల్లుకు తరలిస్తుండగా రాయికల్ శివారులోని బ్రిడ్జిపై గల గుంతలతో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ మహ్మద్ జలీల్ చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఘటన స్థలాన్ని కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, వడ్లకొండ మహేశ్ పరిశీలించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తి కాలేదని, బ్రిడ్జిపైన గల గుంతలే ప్రమాదానికి కారణమని ఆరోపించారు. బ్రిడ్జి వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

చివరిగింజ వరకూ కొంటాం

ధర్మపురి: రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దోనూర్‌లో కొనుగోళ్లు పూర్తయ్యాయి. 28 రోజుల్లోనే కొనుగోలు పూర్తి చేయడంపై హమాలీలు, రైస్‌మిల్లర్లను సన్మానించారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చుతుందన్నారు. నాయకులు ఎస్.దినేష్, వేముల రాజు, చిలుముల లక్ష్మణ్, రైసమిల్లర్లు రంగ శంకరయ్య, వెంకటేశ్వర్ రావు, రైతులు తదితరులున్నారు.

నేటి నుంచి చిడుతల రామాయణం

మల్యాల: మండల కేంద్రంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు చిడుతల రామాయణం నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు రాగుల రవీందర్ తెలిపారు. స్థానిక పోచమ్మ వాడలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. నాటక ప్రదర్శనను తిలకించేందుకు స్థానికులు తరలిరావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ, ఎర్దండి,ఇబ్రహీంపట్నం గ్రామాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రౌడీషీట్లను ఎత్తివేయాలి

మెట్‌పల్లి: చట్ట విరుద్ధంగా మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన రౌడీషీట్లను వెంటనే ఎత్తివేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు బర్ల వంశీ, నాయకులు షేర్ భరత్, బన్నీ, తరి అఖిల్, అక్షయ్ మంగళవారం డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఐ లక్ష్మీనారాయణ కాంగ్రెస్ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారని, కొందరిపై కుట్రతో రౌడీషీట్లు తెరిచారని, వీటిపై విచారణ జరిపి ఎత్తివేయాలని కోరారు.

గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా గంగరాజు

మల్లాపూర్: గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) మల్లాపూర్ అధ్యక్షుడిగా సంగ గంగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కల్యాణ మండపంలో మంగళవారం గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఇల్లెందుల తుక్కారాం, కోశాధికారిగా సంబు తిరుపతి, కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

బీఆర్‌ఎస్ మండల మీడియా కన్వీనర్‌గా జలందర్

గొల్లపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ మండల మీడియా కన్వీనర్‌గా గొల్లపల్లికి చెందిన కోమల్ల జలందర్‌ను నియమిస్తూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం గొల్లపల్లిలో జలందర్‌ను జెడ్పీటీసీ గోస్కుల జలందర్, పార్టీ మండల కోఆర్డినేటర్ బోయపోతు గంగాధర్, మండల ప్రజాప్రతినిధులు అభినందించారు.

కొండంతా బురద..



సెక్యూరిటీ గేటు సమీపంలో నిలిచిన నీరు



ఆలయంలో నిలిచిన నీరు

కొండగట్టు: కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి మంగళవారం దర్శనానికి వచ్చిన భక్తులు బురదతో ఇబ్బందిపడ్డారు. సెక్యూరిటీ గేటు సమీపంలో, ఆలయంలోపల, ఆలయం బయట ఎక్కడ పడితే అక్కడే అపరిశుభ్రంగా ఉంది.శానిటేషన్ అధికారులు మాత్రం వెంటవెంటనే శుభ్రం చేయాల్సింది పోయి,ఎక్కడ బురదను అక్కడే ఉంచి,నిర్లక్ష్యంగా విధులు నిర్వహించారు. వారి తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మల్లాపూర్: 27 ఏళ్ల క్రితం మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10 తరగతి చదివిన 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం అందరూ ఒక చోట కలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ ఆటపాటలతో నృత్యాలు చేస్తూ ఆనందోత్సహాలతో గడిపారు. తమను విద్యావంతులుగా తీర్చిదిద్ది ఉన్నత భవిష్యత్తుకు దోహదపడిన ఉపాధ్యాయులను ఏప్పటికి మరిచిపోమని, వారికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, ప్యాక్స్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్, మాజీ సర్పంచ్ ద్యాగ గంగారెడ్డి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ.రఫీ, కాంగ్రెస్ సేవా దళ్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సింగారపు అశోక్, ఎండీ.బాబా, మాట్ల శ్రీనివాస్,మహిపాల్, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.